# "పడవ"

రచన :–
కె. ఆర్. కె. మోహన్
బి. ఎ.,

(గత సంచిక తరువాయి)

ఆమె ఒక చిన్నగుట్టమీద ఎక్కి కళ్ళు మూసుకొని, ఆఖరిసారిగా తనబిడ్డని తలచుకుంటూ సముద్రంలోదూకేసింది.

మరుక్షణంలో ఉవ్వెత్తుగా వచ్చిన కెరటం నిర్మలని నెట్టుకుంటూ తీసుకెళ్ళి, ఒక చిన్న కొండగుట్టమీద ఎగ రేసి పడేసింది. ఆమె తలకి దెబ్బతగిలి నెత్తురు కారడం మొదలు పెట్టింది. అబ్బ! సముద్రుడుకూడా, నా యీ పాపిష్టిశరీరాన్ని తాకడానికి ఇష్టపడడం లేదు కాబోలు అనుకుంది: కారుతున్న నెత్తుటిని చేతిలో అదుముకుంటూ

ఒక్కసారి నలువైపులా పరికించింది నిర్మల. కెరటాలువచ్చి మాటిమాటికీ కొండరాళ్ళని తగులు తున్నా యి. అయినా ఆ రాళ్ళు నిశ్చలంగా నిలిచే ఉన్నాయి. ధైర్యంగా సముద్రపు తాకిడిని ఎదుర్కొంటున్నాయి. పైగా ఆ సంఘర్షణతో గరుకుగా ఉన్న ఆ రాళ్ళు నునుపుదేరుతున్నాయి.

నిర్మల ఆలోచించింది. చచ్చి ఎవరిని సాధించాలి? బ్రతికిఉండి జీవితాన్ని ఎదుర్కోవాలి. ఆ రాళ్ళనలెనే నా గుండెనిగూడా బండగా మార్చుకోవాలి బ్రతికిఉంటే ఏనాటికైనా తన బాబుని కలవవచ్చు. తన చదువుతో ఏదో ఉద్యోగం చూచుకుని, తన జీవితాన్ని వెళ్ళబుచ్చుకోగలదు. కళ్ళల్లో వెలుగుతున్న నూతన కాంతితో లేచింది. తిన్నగా రోడ్డు ఎక్కి మళ్ళీ ప్రయాణం సాగించింది.

నాలుగు నెలలు గడిచాయి. ఒక రోజున నిర్మల అనాథాశ్రమానికివెళ్ళి మాధవస్వామిగారిని కలిసింది.

ఆయన నిర్మలని సాదరంగా ఆహ్వానించి "రా అమ్మా, కూర్చో, ఏం కావాలి నీకు?" అన్నాడు.

> ఉగాది చుక్కాని కథల పోటీలో బహుమతి పొందిన మూడు కథల లోని రెండవ కథ ఇది.
>
> సం॥

"నా పేరు నిర్మలండీ. బియస్. సి., వరకు చదివాను: మా ఊరు తుని. ఈ ఊళ్ళో చదువు అయిపోయింది. మా వూరు కెళ్ళి పోబోతున్నాను. మీ ఆశ్రమం గురించి చాలాసార్లు విన్నాను వెళ్లేముందు ఒక్కసారి చూసిపోదామని వచ్చాను." అంది

"చాలా సంతోషమమ్మా ... రా చూద్దువుగాని" అంటూ లోపలికి తీసుకుని వెళ్ళారు ఆయన

ఆశ్రమంలో సుమారు అరవైమంది దాకా బాలబాలికలు పసిపాపలనుంచి పదహారేళ్ళవరకూ ఉన్నారు వాళ్ళంతా శుభ్రంగా తయారయి, చదువుకుంటూ, ఆడుకుంటూ, చేతిపనులు నేర్చుకుంటూ, చక్కని జీవితం గడుపుతున్నారు.

ఒకచోట ఉయ్యాలలోని ఉన్న నెలల బిడ్డనిచూసి ఇక్కడ ఇంతటి పసివాళ్ళుకూడా ఉన్నారే! అంది నిర్మల ఆశ్చర్యాన్ని నటిస్తూ.

"అవునమ్మా. షుమారు నాలుగు నెలల క్రితం ఎవరో దారితప్పిన స్త్రీ. ఈ పాపడని, ఆశ్రమం అరుగుమీద ఉంచేసి వెళ్లిపోయింది. ఆత్మహత్యచేసుకుంటున్నాననీ, బిడ్డని జాగ్రత్తగా చూసుకోమనీ వ్రాసి మరీ పోయింది" అన్నాడు మాధవస్వామిగారు.

"ఆ తల్లిది ఎంతటి రాతిగుండో" అంది నిర్మల, పిల్లవాడిని చేతుల్లోకి తీసుకుంటూ. ప్రక్కకు తిరిగివస్తున్న కన్నీటిని తుడుచుకుంది.

"స్త్రీకి సహనం ఎక్కువమ్మా... స్త్రీ హృదయం ఎప్పుడూ సున్నితమైనదే. వెన్నవంటిగుండె రాయిగా మారిందంటే, పాపం ఆ తల్లి ఎటువంటి బాధలో లోనయిందో!" అన్నారు మాధవస్వామిగారు నిట్టూరుస్తూ.

స్వామిగారి విశాల హృదయానికి మురిసిపోయింది నిర్మల. "పాపడు ఎంత ముద్దొస్తున్నాడండీ!" అంటూ పదే పదే హృదయానికి హత్తుకుంటూ ముద్దులాడ మొదలు పెట్టింది. "ఇంత చక్కటి పాపడిని పెంచుకులేని ఆతల్లి ఎంతటి దురదృష్టవంతురాలో!" అంది నిర్మల. "నిజమేనమ్మా...కాని ఆ దురదృష్టాన్ని, కోరితెచ్చుకుందంటే, ఆ తల్లిగుండెల్లో ఎంతటి విషాదం నిండి ఉండాలి!" అన్నారు ఆయన.

"మరి ఈ బాబు నెవరు చూస్తున్నారు?" అంది నిర్మల.

"ఇంతవరకూ... మా ఆవిడే ... సుభద్రమ్మ... అదుగో అక్కడ ఆపిల్లకు జడ వేస్తుందే... ఆవిడ!" అన్నారు ఆయన.

"దంపతులిద్దరూ ఎంతటి పుణ్యమూర్తులండీ!" అంది నిర్మల కృతజ్ఞతా పూర్వకంగా.

"కాదమ్మా పాపకర్ములం. మాకు భగవంతుడు ఆస్తినిచ్చాడు కాని సంతానాన్ని ఇయ్యలేదు. సంతానయోగం మాకు లేదని తెలుసుకున్నాక ఈ ఆశ్రమం పెట్టి నా అన్నవాళ్లు లేని ఇటువంటి అభాగ్యులను పెంచుతున్నాం. వాళ్ళకు మేమే తల్లిదండ్రులము, మాకు వాళ్ళే బిడ్డలు. ఇందులో పెరిగిన వాళ్ళు ఎంతోమంది, జీవితంలో చాలా పైకివచ్చారమ్మా. వాళ్ళంతా ఎవరికితోచిన సహాయం వాళ్ళు చేస్తూంటారు దాంతోను, మాకువున్న కొద్ది ఆస్తిలోనూ. ఏదో విధంగా నెట్టుకొస్తున్నాం, భగవంతుడి దయవల్ల" అన్నారు ఆయన.

"మీ ఆశ్రమం చూసినప్పటినుంచీ, నా హృదయం ఆనందంలో పొంగి పోతోంది. నాతల్లీతండ్రీలేరు. మేనమామగారింట్లో పెరిగాను. ఇప్పుడు చదువు అయిపోయింది. ఏమి చెయ్యాలా అని ఆలోచిస్తూన్నాను. మీకు కనక అభ్యంతరం లేకపోతే, ఇక్కడే ఉండి మీకు తోడుగా ఉంటాను, ఆ పసిబిడ్డలకి తల్లి లేని లోటు తీరుస్తాను. ఏమంటారు?" అంది నిర్మల ఆవేశంగా.

"అమ్మా... నీ సంకల్పం అయితే మెచ్చుకోతగినదే. కాని నీకు ఉద్యోగం ఇచ్చి జీతం ఇచ్చే తాహతు నాకు లేదమ్మా." అన్నారు ఆయన.

"నేను చెప్పానుగదా నాకెవ్వరూ లేరని. ఒక్కపొట్టకి ఎంతకావాలి! నా పేర ఒక ఎకరం పొలం ఉంది. దానితో పైఖర్చు సరిపోతుంది. సందేహించకండి" అంది నిర్మల.

"మంచిదేనమ్మా... కాని నీవు పెళ్ళికావలసినదానవు. ఇక్కడ ఎన్నాళ్ళు ఉండగలవు?" అన్నారు ఆయన.

"నాకు చిన్నప్పటినుంచీ కూడా ఇటువంటి సంఘసేవ అంటే ఇష్టం. ఫ్లారెన్సు నైటింగేలు నాకు ఆరాధ్య గురువు. కనుక నాకు వివాహం చేసుకునే ఉద్దేశం లేదు. నామాట వదిలేయండి. మీకు మాత్రం మనిషి అవసరం లేదా? మీగిద్దరూ ఎంతమందిని చూడగలరు?" అంది నిర్మల.

"ఆమాట నిజమేనమ్మా... జీతం మీద మనుష్యులని చాలా కాలం పెడ్తూ వచ్చాను. కాని జీతంమీద దృష్టిఉండే వాళ్లు, పిల్లలమీద ప్రేమాభిమానాలు ఏమి చూపించగలరమ్మా? అందుకే వాళ్లు తరుచుగా మానేస్తూఉండేవారు. నీవు మనస్ఫూర్తిగా వస్తానంటే నాకు సంతోషమే తల్లీ." అన్నారు మాధవస్వామిగారు.

పట్టరాని సంతోషంతో ఒప్పుకుంది నిర్మల.

ఆనాటినుంచీ నిర్మల ఆ ఆశ్రమం లోనే ఉండిపోయింది. అక్కడి పిల్లలందర్నీ. కన్నతల్లికన్న మిన్నగా సాకసాగింది. అందులో ఆ పసివాడిని, చూసేవారికి, సాక్షాత్తుకన్న తల్లేనేమో అన్నట్లుగా సాక సాగింది.

రోజులు త్వర త్వరగా గడిచిపోతున్నాయి. నిర్మల పోగొట్టుకున్న ఆనందాన్ని, బిడ్డని చూసుకోనడంలో తిరిగి పొందగలిగింది. వాడికి ముద్దుగా 'శేఖర్' అని పేరు పెట్టుకుంది.

నాలుగు సంవత్సరాలు గడిచాయి.

ఒకరోజున, అప్పలరాజుగారనే ఒక అ[illegible]ధికారి, తన భార్యతోసహా ఆ ఆశ్రమం చూడడానికి వచ్చారు. ఆ ఆశ్రమాన్ని చూసి, అందులోని పిల్లలని చూసిచాలా ముచ్చట పడ్డారు. ఆదంపతులు, అందులో శేఖర్ తన అందచందాలలోనూ, ఆటపాటలలోనూ, చలాకీతనంలోనూ, ఆదంపతులను బాగా ఆకర్షించాడు. తర్వాత వాళ్ళు మాధవస్వామిగారితో చాలా సేపు మాట్లాడి వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళాక, మాధవస్వామిగారు, నిర్మల దగ్గరికి ఎంతో సంతో సంతోషంతో వచ్చారు "అమ్మాయి నిర్మలా" అంటూ.

(సశేషం)


దీర్ఘరోగులకు
ఉత్తమ వైద్యము

నపుంసకత్వము, శుక్ల నష్టము (హస్త ప్రయోగము, అంగము సన్నగిలి కురచ సంభోగ కాల మందు అసంతృప్తి నిన్న) ఒక డోస్‌తో ఎన్నడు కనివిని ఎరుగని వీర్యస్తంభనకల్గి హాయినిచ్చును. స్త్రీనికోరు ప్రతి పురుషుడు వాడ తగినది ఉబ్బసము, బోద కాళ్ళు, చెవుడు, కడుపునొప్పి, కుష్ఠు, బొల్లి, చర్మవ్యాధులు గ్యారంటీ వైద్యము పోస్టుద్వారా కూడ చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల
డా॥ పి. కుమారస్వామి దేవర
ట్రావెలర్సు బంగ్లా రోడ్డు
తెనాలి (ఎ.పి.)



అందమైన అచ్చుపనులకు ఆర్డర్లు ఇచ్చినయెడల సకాలములో ప్రింటుచేసి ఇవ్వబడును.
PHONE : 43173
ఉదయా ప్రింటర్సు
సుల్తాన్ బజార్, హైద్రాబాద్